క్లుప్తంగా

కాశీనాథున్ని దర్శించుకున్న మంత్రి



వారణాసిలో మంత్రి ఉషశ్రీచరణ్ దంపతులు

కళ్యాణదుర్గం: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో కొలువైన కాశీ విశ్వనాథున్ని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ దంపతులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు కంబదూరుకు మంత్రి రాక

కంబదూరు: మండల కేంద్రంలో ఆదివారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజుయాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11కు ఓబయ్య కాలనీలో నిర్వహించే కార్యక్రమంలో నిరుపేదలకు మంత్రి ఇంటి పట్టాలు పంపిణీ చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముళ్లపొదల తొలగింపు



జేసీబీతో ముళ్లపొదలను తొలగిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని గంజికుంట గ్రామానికి చెందిన యువత, సర్పంచు జయేంద్రరెడ్డి ఉదారత చాటుకున్నారు. గ్రామం నుంచి వజ్రకరూరుకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. శనివారం వారు జేసీబీ ద్వారా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో గ్రామస్తులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేశారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు

- వివిధ రూపాల్లో కొలువుదీరనున్న అమ్మవారు
- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి



వజ్రకరూరు: పూజలందుకుంటున్న జనార్దన వేంకటేశ్వరస్వామి



రాయదుర్గం: అలంకరణలో బన్ని మహంకాళి అమ్మవారు



వజ్రకరూరు: పూజలందుకుంటున్న నగరేశ్వరస్వామి



రాయదుర్గం: అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



కళ్యాణదుర్గం: ముస్తాబైన శ్రీవారు

రాయదుర్గం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు పట్టణంలోని శాంతినగర్, కూరగాయల మార్కెట్, కోర్టు ఎదుట వెలసిన బన్నీ మహాంకాళి అమ్మవారితో పాటు కోటలోని వాసవి కన్యాకపరమేశ్వరి, కాళికాంబేశ్వరి, బళ్లారి రోడ్డులోని హటక్వేరుడి ఆలయంలో పార్వతీ, పరమేశ్వరుడికి నిత్య పుస్తక పఠానోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లను సిద్ధం చేశారు. శనివారం అమావాస్య కావడంతో ఆలయాలన్నీ భక్తులతో సందడిగా కనిపించాయి. శాంతినగర్‌లోని పెద్ద బన్ని మహంకాళి ఆలయం వద్ద భక్తుల రద్దీ దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకూ విద్యుత్‌దీపాలతో అలంకణ చేపట్టారు. తొమ్మిది రోజులు పాటు చేపట్టే దసర ఉత్సవాలను భక్తి,శ్రద్ధలతో నిర్వహించనున్నారు. డి హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం వద్ద ప్రసిద్ధి చెందిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలోనూ దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోని మున్సిపాలిటీ కార్యాలయం, ఆర్డీటీ ఆస్పత్రి దగ్గర ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో 14వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ శ్రీవారి సప్త వాహన సేవలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. మొదటి రోజు అంకురార్పణ ఆకారంలో స్వామిని ముస్తాబు చేశారు. నవరాత్రుల్లో మొదటి రోజు కావటంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా అమావాస్య పూజలు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో శనివారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, రుద్రాభిషేకం, అర్చనలు, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం స్థానికులతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి అన్నదానాన్ని స్వీకరించారు. అర్చకుడు రామయ్యస్వామి, భక్తులు పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరులోని జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకుడు నర సింహామూర్తి, భక్తులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్నకు శనివారం అమవాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనీల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.







రాయదుర్గం: దసరా నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం, అమావాస్య పూజకు ముస్తాబైన అమ్మవారు, బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

వీవర్స్ ఫెడరేషన్‌లో ఇద్దరికి చోటు



చెంగల మహేశ్వర



చందా రాము

ఉరవకొండ: ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్న ఉరవకొండ పట్టణానికి చెందిన చేనేత నాయకుడు చెంగల మహేశ్వరను అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ ద్వారా నియామక ఉత్తర్వులు వెలుబడ్డాయి. అలాగే ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్న పట్టణానికి చెందిన చందా రామును సత్యసాయి జిల్లా పరిశీలకుడిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. వారు మాట్లాడుతూ చేనేత హక్కుల సాధన కోసం పాటుపడతామన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

బొమ్మనహాళ్: మండలంలోని సింగానహళ్లి సమీపంలోని సంగమేశ్వర దేవాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనునట్లు పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వార్డు మెంబర్లు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

ఐదంచెల వ్యవసాయంతో నేలకు ప్రయోజనం

కళ్యాణదుర్గం రూరల్: ఐదంచెల వ్యవసాయంతో నేలకు ప్రయోజనమని ఆగ్రో ఫారెస్ట్రీ రిసోర్స్ పర్సన్ హుమయూన్ అన్నారు. పట్టణంలోని ఎకాలజీ సెంటర్‌లో శనివారం ఆగ్రో ఫారెస్ట్రీపై సే ట్రిస్ వర్క్ షాప్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కుందిర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం, బెళుగుప్ప మండలాలకు చెందిన రైతులు హాజరయ్యారు. ఎకాలజీ సెంటర్ అగ్రికల్చర్ స్పెషలిస్ట్ ఎస్.వీరభద్ర, సే ట్రిస్ ప్రతినిధి కె.వెంకట మహేంద్ర, ఎకాలజీ సెంటర్ మండల టీమ్ లీడర్లు అరుణ కుమార్, భవాని, రమేష్,ఓబుళపతి అవగాహన కల్పించారు.

జోరుగా బ్యాడిగి మిర్చి సాగు

కూడేరు: మండలంలోని ముద్దలాపురంలో బ్యాడిగి మిర్చి సాగు జోరందుకుంది. సుమారు 2 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు బ్యాడిగి మిర్చిని సాగు చేసి ఉంటారు. గ్రామంలో సుమారు 14 ఏళ్లుగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. పెట్టుబడి పోనూ రూ.లక్షల్లో ఆదాయాన్ని పొందుతున్నారు. ముద్దలాపురం బ్యాడిగి మిర్చి సాగుకు పుట్టినిల్లుగా నిలుస్తోంది. ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా క్వింటాల్ బ్యాడిగి మిర్చి నాణ్యతను బట్టి రూ.30 వేల నుంచి 60 వేల వరకూ పలికింది. పంట సాగు చేసిన రైతులకు కాసుల పంట పండింది. దీంతో బ్యాడిగి మిర్చి సాగుకు అన్నదాతలు ఆసక్తి చూపారు. ఎకరాకు సుమారు రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

శెట్టూరు: మండలంలోని మాకోడికి గ్రామంలో వివాహిత అనిత విష రసాయనం తాగి ఆత్మహత్యకు యత్నించింది. గ్రామస్తుల వివరాల మేరకు.. వడ్డే అంబరీష్, అనితకు పదేళ్ల కిత్రం వివాహమైంది. శనివారం అనిత విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను కళ్యాణదుర్గం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విస్తృతస్థాయి సమావేశం విజయవంతం చేయండి



ఉరవకొండ: మాట్లాడుతున్న పార్టీ నాయకులు



వజ్రకరూరు: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని జనార్ధన వేంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన ఉన్న మినీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం మినీ కల్యాణ మండపాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్, ప్యాపిలి కిష్టప్ప, చంద్రానాయక్, ప్యాపిలి రమేష్, రాకెట్లబాబు, భీమా, రామ్లనాయక్, కిష్టన్న, ధనుంజయతో కలసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఉరవకొండ మాజీ ఎమె ల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసులు హాజరవుతారన్నారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధు లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

16న ఉరవకొండలో..

ఉరవకొండ: ఉరవకొండ పట్టణ, రూరల్ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాలు ఈ నెల 16న ఉరవకొండ వీరశైవ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయ కర్త మూలగిరిపల్లి ఓబన్న తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గవిమఠం వెనుక వైపు ఉన్న వీరశైవ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణ పార్టీ నాయకులకు, మధ్యాహ్నం 2గంటలకు రూరల్ పార్టీ శ్రేణులకు సమావేశాలు జరుగుతాయన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో వై ఏపీ నీడ్స్ సీఎం జగన్ అనే అంశంపై పార్టీనేతలు, కార్యకర్తలను సమయత్తం చేయనున్నట్లు వారు తెలిపారు. పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఈడిగ ప్రసాద్, వైస్ ఎంపీపీ నరసింహులు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, కమ్మటి రామాంజనేయులు పాల్గొన్నారు.

17న కూడేరులో..

కూడేరు: మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఈ నెల 17న వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం, మండల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, నియోజక వర్గ పరిశీలకుడు శ్రీనివాసులు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి హాజరవుతారన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఉరవకొండ: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉరవకొండ పట్టణంతో పాటు మరో ఏడు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే నింబగల్లు వద్ద ఉన్న ఎస్ఎస్ ట్యాంకుల్లో రాత్రింబవళ్లు నీటి పంపింగ్ చేపడుతున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా హెచ్చెల్సీకి కేవలం తాగునీటి అవసరాలకే అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో అప్రమత్తమైన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అంజుమన్‌సఫ్రీన్, కాంట్రాక్టర్ మహనందరెడ్డి ఎస్ఎస్ ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపేందుకు శ్రీకారం చుట్టారు.

10 మోటార్లతో నీటి పంపింగ్

నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నింపడానికి 10 మోటార్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో 30 హెచ్‌పీ-3, 40 హెచ్‌పీ-2, 50 హెచ్‌పీ-1, 12 హెచ్‌పీ-2 తో పాటు రెండు ఆయిల్ ఇంజిన్ మోటార్లు వినియోగించారు. ఈ మోటార్ల ద్వారా రోజుకు 70 వేల లీటర్లు పంపింగ్ చేపడుతున్నారు. ప్రస్తుతం పెద్దట్యాంకులో 8.50 అడుగల మేర నీరు నిల్వ ఉంది. బండల చెరువులో మూడు మీటర్లు, రాయంపల్లి చెరువులో రెండు మీటర్ల మేర నీరు నిల్వ ఉంది.



హెచ్చెల్సీ ద్వారా పాత ట్యాంకులో చేపట్టిన నీటి పంపింగ్

డీఈఈ అంజుమన్ సఫ్రీన్ మాట్లాడుతూ మొత్తం మూడు ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపి రానున్న వేసవిలో పట్టణంతోపాటు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు.

నిధుల మంజూరుపై ఎంపీకి కృతజ్ఞతలు



ఎంపీ తలారి రంగయ్యకు వినతిపత్రం అందజేస్తున్న మండల నాయకులు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ, శ్రీధరఘట్ట గ్రామాల్లో శ్మశాన వాటికల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేసిన ఎంపీ తలారి రంగయ్యకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం అనంతపురంలో ఎంపీని కలసి నాయకులు సమస్యను వివరించారు. శ్రీధరఘట్ట గ్రామంలో మైనార్టీ శ్మశాన వాటిక, గోవిందవాడ గ్రామంలో వీరశైవ లింగాయత్ శ్మశాన వాటిక కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. వెంటనే ఎంపీ స్పందించి ఒక్కో శ్మశాన వాటిక కోసం రూ. 10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. నిధుల మంజూరుపై మైనార్టీలు, వీరశైవ లింగాయత్‌లు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసేన్, లాలుసాబ్, రఫీ, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఖాకీపై అవినీతి మరక!

- కర్ణాటక సరిహద్దు స్టేషన్లలో సిబ్బంది చేతివాటం
- 'దుర్గం' సబ్ డివిజన్లో ఐదుగురు వీఆర్‌కు
- ఎస్పీ చర్యలతో బెంబేలెత్తుతున్న అక్రమార్కులు



కళ్యాణదుర్గం పోలీసు సబ్ డివిజనల్ కార్యాలయం

కళ్యాణదుర్గం: అక్రమార్కులతో జతకట్టి చేతివాటం ప్రదర్శించిన పోలీసు సిబ్బందిపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కొరడా ఝులిపించారు. ఖాకీపై వచ్చిన అవినీతి మరకను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ప్రధానంగా కర్ణాటక సరిహద్దు పోలీసు స్టేషన్లు కుందుర్పి, బొమ్మనహాల్‌లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. ఆయా స్టేషన్ల పరిధిలో మట్కా, క్రికెట్ బెట్టింగ్, అక్రమ మద్యం, అక్రమ ఇసుక రవాణా చేస్తున్న కొందరితో వారు చేతుల కలిపి పోలీసు శాఖ ప్రతిష్టను దిగజార్చారు. ఆయా అక్రమార్కులతో ప్రతి నెలా మామూళ్లకు అలవాటు పడ్డారు. ఏదైనా కేసులలో పట్టుబడితే వెంటనే వారిపై లాలూచీ పడుతూ జేబులు నింపుకుంటూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు సమాచారం.

సిబ్బందిపై ఎస్పీ సీరియస్

కళ్యాణదుర్గం పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని కుందుర్పి, బొమ్మనహాళ్ పోలీసు స్టేషన్లలో అక్రమార్కులతో కలిసి చేతివాటం ప్రదర్శించిన ఐదుగురిపై జిల్లా ఎస్పీ సీరియస్ అయ్యారు. ఇందులో భాగంగా కుందుర్పి ఎస్ఐ పి.కృష్ణమూర్తి, హెడ్ కానిస్టేబుల్ జె.శివరంగనాయకులు, బొమ్మనహాల్ పోలీసు స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ఎన్.సురేష్, ఎన్.హనుమంతనాయక్, కానిస్టేబుల్ ఎస్.అశోక్‌లను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఆదేశాలిచ్చారు. ఎస్పీ చర్యలతో ఖాకీ అక్రమార్కులు బెంబేలెత్తుతున్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారి కొందరిపై ఇప్పటికే జిల్లా ఎస్పీ ఆరా తీసినట్లు సమాచారం. డీఎస్పీ స్థాయి అధికారి చే నిఘా ఉంచడంతో ఎవ్వరిపై వేటు పడుతుందోననే ఆందోళనలో సిబ్బంది ఉన్నారు. ఏదిఏమైనా జిల్లా ఎస్పీ తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

20 ఏళ్ల సమస్యకు పరిష్కారం



ధర్మపురిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభమైన దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురిలో 20 సంవత్సరాలుగా నలుగుతున్న సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి మెయిన్ రోడ్డు వరకూ రహదారి గుంతలు పడి అధ్వానంగా ఉండేది. రోడ్డు వేయాలని గతంతో గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కృషితో గడప గడపకూ మన ప్రభుత్వం, ఉపాధి పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.15 లక్షల నిధులు మంజూరయ్యాయి. సర్పంచు సోమశేఖర్‌రెడ్డి శనివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.